కథాశేషం

# ముసలంతోనే మోక్షం



గాలి బాలసుందర రావు

మల్లిఖార్జునశర్మ ఊరు తెలంగాణాలో కుగ్రామం.

అప్పటికి స్వరాజ్యం కనుచూపు మేరలో వుంది. స్వాతంత్ర్యోద్యమంతో బహిరంగంగా కాకపోయినా పరోక్షంగా అతనికి సానుభూతి, సంబంధమూ ఉండేవి. ఖద్దరు కానీ కట్టేవాడు కాదు. వాళ్ళ పూర్వులు అందరూ నైజాం, పరిపాలనలో చిన్నవీ, పెద్దవీ అయిన ఉద్యోగాలు చేసిన వారే. జైలుకు వెళ్ళకపోయినా కనీసం నవాబు గారి నౌఖరీ అయినా చేయకుండా ఉండకపోతే తన స్వాతంత్ర్య యోధత్వానికి కళంకమొస్తుందని, పరంపరగా వస్తున్న కరణీకం కూడా మానేశాడు. పూర్వులు ఆర్జించిన పొలము, మెరక, చెరువు కింద మాగాణీ ఉన్నవి. ఆయనకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు వాసుదేవరావు సర్వవ్యాసంగ సామ్రాట్టు, రెండోవాడు శ్యామలరావు. ఇంకా చిన్నవాడు, పెద్ద కూతురి పేరు విశాలక్ష్మి. రెండో పిల్ల మాలతి.

ఆ రోజుల్లో నైజాం స్టేటు రైల్వేలో చాలామంది సర్కార్ జిల్లా వాళ్లు ఉద్యోగం చేస్తూ ఉండేవాళ్లు. అడగనివాడు పాపాత్ముడుగా, ఉద్యోగాలు దొరుకుతూ ఉండేవి. అటువంటివారివల్ల, నైజాం రాష్ట్రంలో కుటుంబాలవారికి సర్కార్ జిల్లాల్లో కుటుంబాల వారికి సంబంధ బాంధవ్యాలు బాగా ఏర్పడుతూ ఉండేవి. మల్లిఖార్జున శర్మ పెద్ద కూతుర్ని గుంటూరు జిల్లాలో మరొక ఛోటా కాంగ్రెసు నాయకుడి కొడుకు విశ్వనాధానికి ఇచ్చి పెళ్ళి చేశాడు. ఆ నాయక కిశోరం పేరు పూర్ణానందం. ఆయన నాలుగైదు సార్లు జైలుకు వెళ్ళాడు. నాలుగు అయిదు లాఠీ ఛార్జీలకు గురి అయినాడు. అతని ఫాలభాగం పెద్ద పెద్ద గాయం మచ్చ కనపడుతూ వుంటుంది కూడా! ఆ మచ్చను ఆయన ఒక శాంతి ప్రతాప చిహ్నంగా భావించేవాడు. సర్ ఆలివర్ క్రామ్‌వెల్ అనే బ్రిటీషు యోధుడి శరీరం నిండా చాలా యుద్ధ గాయముల మచ్చలు ఉండేవట. ఒక చిత్ర కారుడు ఆయన చిత్రాన్ని గీయడానికి వస్తే "నా మచ్చలన్నీ కనబడేటట్లుగా చిత్రించు" అని ఆదేశించాడట.. పూర్ణానందం చిత్రం ఏ చిత్రకారుడూ గీయడానికి రాలేదు కాని, అతను మాత్రం ఆ గాయం కనబడేటట్లుగానే గాంధీటోపీ కూడా ఒక పక్కగా పెట్టుకునేవాడు. ఆ గాయ చరిత్రను ఖర్మం చాలక ఎవరైనా అడిగారా, గాంధీ మహాత్ముడి శాంతి విధానం మీద, బ్రిటీషువారి దమన నీతి మీద, తనకు ఆ గాయాన్ని ప్రసాదించిన అమానుష సంఘటన యొక్క ప్రాముఖ్యత మీద ధణుతు లేచేట్లు లెక్చరు ఇచ్చేవాడు. ఆ గాయాన్ని చూపించి వియ్యంకుడు మల్లిఖార్జున శర్మ జైలుకు వెళ్ళలేని పిరికితనాన్నీ, రాజకీయాల్లో తీవ్రంగా పాల్గొనలేకపోవడంలో అతని దూరదృష్టి రాహిత్యాన్నీ తీవ్రంగా విమర్శించేవాడు. ఆయన పోరుపడలేక మల్లిఖార్జున శర్మలో కూడా జైలుకు వెళ్ళాలనే సంకల్పం ఘనీభవిస్తూ మళ్ళీ కరిగిపోతూ ఉండగానే పుటుక్కున స్వరాజ్యం వచ్చేసిందన్నారు. "దొరలకంటే దుడిశాం కానీ, దేశవాళీ నాయకులకు జడుస్తామా?" అని నైజామూ, అతన్ని రెచ్చగొట్టే రజాకార్లూ, ఆందోళనలు, అల్లర్లు సాగించారు. మల్లిఖార్జున శర్మ ఆ సందర్భంలోనైనా, కారాగృహవాస కీర్తిని వశం చేసుకుని వియ్యంకుడి విజృంభణను అరికడదామనుకున్నాడు. కాని, కాంగ్రెసువాళ్ళకు బ్రిటీషువాళ్ళలాగా, తిరుగుబాటు దారుల్ని రజాకర్లు కారాగృహాల్లో ఉంచి "ఏ" క్లాసు, "బి" క్లాసు-తదితర సౌకర్యాలు యిచ్చిన పాపాన పోలేదు. పైగా దేహశుద్ధి, మానభంగ హత్యాకాండలతో హడలగొట్టి పారేశారు. మల్లిఖార్జునశర్మ ఆస్థి యావత్తూ స్వాధీనం చేసుకున్నారు. బ్రతికి వుంటే బలుసాకేరుకు తినవచ్చునని ఆయన సకుటుంబంగా పూర్ణానందం వూరికి పోయి నాలుగైదు నెలలు అతడిచ్చిన "ఏ" క్లాసు అతిథ్యం స్వీకరించాడు. తమకీ బాధ్యత ఎలాగూ తప్పదు అనుకుని పూర్ణానందం, అతడి కొడుకు విశ్వనాథం "మా గాంధీజీ నాయకత్వంలో కాంగ్రెసు శాంతి సైనికులు యిల్లా రజాకార్లకు జడిసి పారిపోయి వచ్చేవారా?" అని పగలనక, రాత్రనక యెద్దేవా చేస్తూ ఉండేవారు. మల్లిఖార్జున శర్మ లోలోపల కుళ్ళుకునేవాడే గాని, దోసావకాయ, వెన్నపూస, గోంగూర పచ్చడి, గేదె పెరుగు మీగడల రుచి ఆ బాధను యెప్పటికప్పుడే ఉపశమింపజేసేవి.

• • •

కాలం గడిచిపోయింది.

పూర్ణానందం రెండవ కొడుకు సీతారామ్‌గాంధీ పెద్దవాడై, మంచి మార్కులతోనే స్కూలు ఫైనలు పరీక్ష పాసైనాడు. చిన్నప్పటినుంచే అతనికి కవిత్వం బాగా అబ్బింది.

స్వరాజ్యం వచ్చి కొన్ని ఏళ్ళయింది. జైలుకు పోయే అవకాశాలు తగ్గిపోయాయి. పదిమందిలో యోధుల్లాగా పరిగణింపబడడానికి అవకాశాలు అంతరించినాయి. ఏదో హిందీ ప్రచార ఉద్యమము, నిమ్న జాత్యుద్ధరణము, భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన, విశాలాంధ్రోద్యమం లాంటివే చాలా వీలుగా ఉందనుకుని, సభలు సమావేశాలు, ఎక్కువ ప్రమాదాలకు గురి కాకుండా ఆందోళనా కార్యక్రమాలు సాగిస్తూ వచ్చారు. మల్లిఖార్జునశర్మ సర్కార్ జిల్లాలో సమావేశాలకు హాజరయ్యేవాడు. పూర్ణానందం తెలంగాణా జిల్లాలో ఆవేశ పూరితంగా మాతృభాషా సంరక్షణావసరమును గురించీ, ముక్కోటి ఆంధ్రులు ఒక్క రాష్ట్రం యేర్పరుచుకోవలసిన అగత్యం గురించీ గుక్క తిప్పుకోకుండా ఉపన్యాసాలిస్తూండేవాడు. అట్టి ప్రమాదంలేని ఈ రాజకీయ కార్యక్రమంలో పాల్గొంటూ మల్లిఖార్జున శర్మ మధుమేహంతో ముసలివాడైనాడు. పూర్ణానందం నెత్తురు పోటుతో సభా కార్యక్రమాలు సంక్షేపించుకున్నాడు. మల్లిఖార్జునశర్మ రెండో కొడుకు శ్యామలరావు పెద్దవాడై విద్యార్థి ఉద్యమ నాయకుడై కూర్చున్నాడు. అతను వచన కవిత్వం కూడా చెప్పేవాడు. కొద్దో గొప్పో ముత్యాలు, పగడాలు కూర్చి పాడిగా గానం చేసేవాడు. రెండు మూడు తెలంగాణా పత్రికల్లో అతని గీతాలు పడుతూండేవి కూడా!

ఢిల్లీ కాంగ్రెసు నాయకుల దగ్గర నుంచి ఆంధ్ర రాష్ట్రం తెచ్చుకోవడం బ్రిటిషు వారి దగ్గర నుంచి స్వాతంత్ర్యం తెచ్చుకోవడం అంత తేలికైన పనికాలేదు. చిరకాలానుభవం వల్ల, "విభజించి పాలించు" అనే రాజనీతి విశారదత్వాన్ని రాజకీయ నాయకులు జీర్ణించుకుని, ఆహరించుకుని, వినియోగించుకోటానికి అలవాటు

పడ్డారు. కాని, ప్రాంతీయ రాజకీయ నాయకుల ధర్మోపన్యాసాల వెనుక వున్న నగ్న సత్యాలు, నిజ స్వరూపాలు, అసలు మనస్తత్వాలు, స్వార్థపరత్వాలు చోటా నాయకులు అర్థం చేసుకుంటూనే ఉన్నారు. మహా సభల్లో "మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడుద్దాం ఆంధ్రులంతా ఐకమత్యంతో మెలగాలి "అని ఉపన్యాసాలిస్తున్నా కాస్త రాజకీయానుభవం ఉన్న తెలంగాణా నాయకులకు సంయుక్త మదరాసు రాష్ట్రంలో అరవవారు, ఐకమత్యం పేరుతో, జాతీయత పేరుతో తెలుగువారికి నామం పెట్టడం గ్రహించలేకపోలేదు. ఆంధ్ర రాష్ట్రోద్యమంతో పాటు సర్కారునాయకులు వెనకబడిఉన్న దత్త మండలం వారికి దక్కకుండా తమకు లభించిన అవకాశాల్లో ఎక్కువ భాగం అనుభవించడం, దత్త మండలం వారు ఆందోళన సాగించటం, తెలంగాణా వారిలో తెలివి తేటలు ఉన్నవారు గమనించి ముందే జాగ్రత్త పడటం మంచిదని తాము ఆందోళనలు సాగించారు. ఆ ఉద్యమంలో మల్లిఖార్జున శర్మ బాగానే మంత్రాంగం నడిపేడు. ఆ మంత్రాంగానికి ప్రతి మంత్రాంగం సర్కార్ వారిలో పూర్ణా నందం అతని సమకాలీకులు సాగించారు.

స్వరాజ్యం వచ్చాక రాజకీయ చైతన్యం అధికమై తమ ఆశయ సిద్ధికి చదువు సంధ్యల కన్నా రాజకీయ ఆందోళనలే ఎక్కువ ఉపయోగకరములని విద్యార్థి ప్రపంచం గ్రహించింది. అసలు, రాజకీయాల్లో ఉన్న కులమతభేద రాజకీయాలన్నీ విద్యార్థి జీవితాన్నీ విద్యార్థి ఉద్యమాన్నీ కలుషితం చేసేసినవి. రాజకీయ ఆందోళనా చదరంగంలో విద్యార్థులు పావులు, శకటులు, ఏనుగులు, గుర్రాలు అయి, పెద్ద నాయకులు రాజులూ, మంత్రులూ కాగా వారు ఎట్లా ఆడమంటే ఆడడం మొదలుపెట్టారు. విద్యార్థి నాయకుల్లో మల్లిఖార్జున శర్మ రెండో కొడుకు శ్యామలరావు పూర్ణానందం కుమారుడు సీతారాం తక్కిన రాజకీయ నాయకుల పిల్లలలాగే విద్యార్థి ఉద్యమంలో ఛోటా నాయకులైనారు. తమ ప్రాబల్యానికి కొరత రాకుండా తెలంగాణా నాయకులు పేచీలు పెట్టి "సర్కారు నాయకుల దగ్గర నుంచి వాగ్దానాలు తీసుకుని విశాలాంధ్ర నిర్మాణానికి ఒప్పుకుందామ"న్నారు. విశాలాంధ్ర అంటూ వస్తే మన రాజకీయ భవిష్యత్తు తుండూ తుపాకీ లేకుండా ఎగిరిపోతుంది రోయ్." అనుకున్న వాళ్ళు "మనమంతా తెలంగాణా వాళ్ళం. వాళ్ళంతా ఆంధ్రులు. వాళ్ళకీ మనకూ సంబంధం లేద"న్నారు. కొందరు కుర్ర నాయకులు "అదంతా అర్థంలేని మాట. తిక్కన సోమయాజి ఆంధ్రుడు, బమ్మెర పోతనామాత్యుడు మరొకడా? మంగళ సూత్రం కట్టడానికి ముందే, కట్నం డబ్బులు చేతిలో వేసుకుంటే కష్టం తీరిపోయినట్టు విశాలాంధ్ర ఏర్పడటానికి ముందే మనకు కావలసిన ప్రత్యేక రక్షణలు పెద్ద మనుష్యుల ఒప్పందములు ఏర్పాటు చేసుకుంటే తీరిపోతుంద"న్నారు.

ఏ సంస్కరణలు యెంతమంది బుద్ధిమంతులు యెంత ఆలోచించి చేసినా కొంత కాలానికి వాటివల్ల కొన్ని సత్ఫలితములూ కొన్ని దుష్ఫలితములూ కలుగుతాయి. అవి కొందరికి లాభదాయకంగా వుంటాయి. కొందరికి నష్ట హేతువులుగా వుంటాయి. రాష్ట్రమైనా, దేశమైనా, ఒక సమిష్టి కుటుంబంలాంటిది. కుటుంబ పెద్ద కుటుంబ వ్యవహారములు చూడడంలో అందర్నీ సమానంగా చూడాలి. లేకపోతే అసంతృప్తి. చివరకు వేర్లు బడడం వ్యాజ్యాలు వేసుకోవడం, తలస్థిస్తుంది.

## ఈ కథ ఎందుకు?

కీ.శే. గాలి బాలసుందర రావు బహుముఖ ప్రజ్ఞావంతులు. వృత్తిరీత్యా వైద్యులు. అయితే ఆయనకు సాహిత్యంలోనూ లలిత కళల్లోనూ పరిజ్ఞానం, అభిరుచి ఉండటంతో, సరళశైలిలో అనేక వైద్య శాస్త్రీయ రచనలతో పాటు, చక్కని సాహిత్య సృష్టి కూడా చేసారు. "కథ అనే సాహిత్య ప్రక్రియ ఆత్మ వికాస హేతువూ, హృదయపరివర్తన హేతువూ అయి సంఘ ప్రగతికి దారి తీయాలని" వీరి నమ్మకం. వారి ఈ రచన 'ముసలంతోనే మోక్షం' ఆలోచనలు రేకెత్తించే కథ. దీని వెనుక చారిత్రిక, సామాజిక నేపథ్యం ఉంది. మన సమాజానికే కాక, జాతికంతకూ సంబంధించినది. సమాజంలో వివిధ కాలాల్లో పని చేస్తూ వచ్చిన వివిధ శక్తుల ప్రభావాలు దీనిలో కనిపిస్తాయి. ప్రాంతీయ ఆవేశాలకు, వైషమ్యాలకు కారణభూతులయ్యే నారాయణరెడ్డి, మల్లికార్జున శర్మలాంటి స్వార్థపరులు ఎప్పుడూ ఉంటూనే ఉంటారు. తన కథలో కుండబద్దలు కొట్టినట్టు వెలిబుచ్చిన కొన్ని అభిప్రాయాలతో ఏ కొందరో ఏకీభవించకపోవచ్చు. అయితే, 'ఏ ప్రాంతం వారైనా, యితర ప్రాంతాల వారిని రానీయకపోతే ఇక దేశమేమిటి?' అన్న రచయిత మాటలో అందరూ ఏకీభవిస్తారు.

ఆంధ్రరాష్ట్రం రావడమూ, అది ఆంధ్రప్రదేశ్‌గా అవతరించడమూ జరిగిపోయినవి. ధర్మ హీనుడైన కుటుంబ జ్యేష్ఠుడు కుటుంబ ధనాన్ని తన సంతానానికే అధికంగా వాడినట్లే ప్రజాస్వామికంలోనూ మెజారిటీ వున్న అల్ప శ్రేణికి చెందిన నాయకులు తమ ప్రాంతాలకూ తమ పక్షానికీ అందులోనూ తమ వారికీ ఎక్కువ మేలు సమకూర్చుకుంటానికి తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తారు. దాంతో వారి నాయకత్వం మఖలో పుట్టి పుబ్బలో రాలిపోతూ వుంటుంది. ఎంతో నీతి కుశలత, రాజనీతి, ధీశక్తి వీటన్నింటికన్నా ముఖ్యంగా సమవర్తిత్వము వున్నవారు తప్ప అధికారాన్ని స్వార్థానికి ఉపయోగించుకునే దౌర్బల్యం నుంచి తమ్ము తాము కాపాడుకోలేరు. ప్రతివారికీ ప్రతి విషయం అంతో యింతో తెలిసి స్వయం నిర్ణయశక్తి అలవడితేగాని ప్రజాభిప్రాయమంటూ యేర్పడదు. అప్పుడుగాని సరియైన ప్రజానిర్ణయం జరగదు. ప్రజా నిర్ణయం గుణగతాల మీద, సమర్థత మీద, జ్ఞానం మీద కాక యితర కారణాల మీద ఆధారపడితే చెడ్డ సాంప్రదాయాలు యేర్పడతాయి, ఒక మాటు అధికారంలోకి వచ్చిన వారు, ప్రజాభిప్రాయాన్నీ దాన్ని యేర్పరచే యంత్రాంగాన్నీ నిర్మించుకుంటారు. ఆ యంత్రాంగాన్నీ మంత్రాంగాన్నీ తమకు అనుకూలంగా నడిపిస్తారు. ఎవరైనా అందర్నీ తృప్తిపరచలేరు గదా! కొందరు అసంతృప్తి పొందక తప్పదు. అల్లా అసంతృప్తి పొందినవారు అధిక సంఖ్యాకులైతే కలవరం విప్లవం యేర్పడతాయి.

మల్లిఖార్జున శర్మ ఊరుకు నీటివనరులేదు. బావులు తవ్వినా నీరు చాలా లోతునపడేది. అందువల్ల యెక్కువ భూమి బంజరుగానే పడి వుండేది. కాని భూగర్భంలో కావలసినంత నీరుందని యెవరికీ తెలియదు. ఆంధ్ర రాష్ట్రం యేర్పడిం తరవాత విద్యుచ్ఛక్తి అధికమయింది. బోరింగు నూతులు వచ్చినాయి. కాస్తో కూస్తో వున్న మల్లిఖార్జునశర్మ కొడుకులు పేదాసాదల పొలం చౌకగా కొన్నారు. విశ్వనాధం కూడా అక్కడ లిఫ్టు యిర్రిగేషన్ చేస్తే బంగారం పండించ వచ్చని పసిగట్టి అయిదు వందల యెకరాలు తండ్రి పేర తమ్ముడి పేర కొన్నాడు. మకాం ఆ కొత్త వూరికి మార్చేడు. అతనితో పాటు సీతారాంగాంధి, ఆ వూరివాడే అయిన లాల్‌ఖానూ బయలు దేరిపోయినారు. తెలంగాణాలోనే స్థిరపడితే ఎందుకైనా మంచిదని పూర్ణానందం అంగీకరించాడు.

లాల్‌ఖాను షిఫ్టుఫారం దాకా చదువుకున్నాడు. ఊళ్ళో, ఉద్యోగాల మీద ఊరువదిలి వెళ్లిన వాళ్ళ పొలాలు కౌలు చేసి, పది డబ్బులు చేసుకున్నాడు. అతని తాత నైజాంవాడే. కూలికి వచ్చి ఆ వూరి మునసబుగారి ఆదరణకు పాత్రుడై అక్కడే వుండిపోయినాడు. పదియెకరాలు సంపాదించుకుని పది డబ్బులు చేసుకున్న లాల్‌ఖాను విశ్వనాధంతో పాటు తన పొలం అంతా అమ్మి ఆ డబ్బుతో ఒక వంద ఎకరాలు కొని పదివేలు ఖర్చు పెట్టి చెరుకు తోటలు ద్రాక్షతోటలూ వేసి లక్షాధికారై లారీ వ్యాపారం మొదలు బెట్టేడు.

అల్లుడూ కూతురు తన దగ్గిరకు వచ్చారని మల్లిఖార్జున శర్మ చాలా సంతోషించాడు. అల్లుడు తరచు హైదరాబాదు వెళ్తూ ఉద్యోగలతోనూ అధికారులతోనూ పరిచయం సంపాదించాడు. హైదరాబాదు పరిసరాల్లో పాతిక యకరముల భూమి కొని అదను వచ్చినప్పుడు ప్లాట్ల క్రింద అమ్ముదామని నిరీక్షిస్తున్నాడు. విశ్వనాధం తమ్ముడు సీతారాంగాంధీ పి.యు.సి పేసయినాడు. అనుకున్నట్లుగానే ఫస్టు క్లాసులో పాసైనాడు.

మల్లిఖార్జున శర్మ రెండో కొడుకు శ్యామల రావు సీతారాంగాంధీ కన్నా నాలుగేళ్ల పెద్దవాడు. అతనూ ఆ వూరి మునసబు కొడుకు రంగారెడ్డి, సీతారాం గాంధీ క్లాసుమేట్లు. శ్యామల రావుకు కవిత్వం అబ్బినా నైజాం తెలుగే వచ్చింది.

రంగారెడ్డి తాత జాగీర్దారు. వారింట్లో పద్ధతులన్నీ జాగీర్‌దార్ల పద్ధతులే. వారంతా అధికంగా ఉర్దూయే మాట్లాడతారు. ఆంధ్రప్రదేశ్ యేర్పడ్డ తరవాతనే కాస్త తెలుగు మాట్లాడడం అలవాటయింది. సీతారాం గాంధి తెలుగులో క్లాసులో మొదటివాడుగావుండేవాడు. తమ కన్నా చిన్నవాడైన గాంధి చదువులో తమకన్నా అధికుడుగా వుండడం రంగారెడ్డికీ శ్యామలరావుకీ కంటకంగా వుండేది. బావమరదుల సరసాల్లో "నైజాం వాళ్ళకి తెలుగేం వచ్చ"న్నాడు గాంధీ. "భమ్మెర పోతారాజా మా దేశంవాడేగా. పెర్‌తాపరుద్రుడు పేద్ద పండితుడు కూడా నంట" అని రంగారెడ్డి ఘాటుగా జవాబుచెప్పేడు. కాని సర్కారు వాళ్ళ తెలుగుతో తన ఉర్దూ మిశ్రితమైన తెలుగు బరాబర్ కాలేదనుకున్నాడు. కాని వాళ్ళ నాన్న పలుకుబడివల్ల అతను, శ్యామలరావు కూడా పి.యు.సి పేసయినారు. వాళ్ళందరూ మెడికల్ కాలేజీలో సీట్లకు దరఖాస్తు చేశారు. సీతారాంగాంధీ ముల్కీ కాకపోయినా ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. అందుకు విశ్వనాధం పలుకుబడి కొంత కారణం. రంగారెడ్డికి,

శ్యామలరావుకూ అసలు సీట్లే రాలేదు. అంతవరకు స్ఫురించని విషయంవొక్కటి వారికప్పుడు స్ఫురించింది. తమ తెలుగు మేష్టరు, ఫిజిక్సు లెక్చరరు, కెమిస్ట్రీ లెక్చరరు కూడా గుంటూరు జిల్లా వాళ్ళేనని ఇంకాస్త యోచిస్తే యింకేమేమో మెదడుకు భాసించి నయి. రక్తంలో వేడినీళ్ళు ప్రవహించినట్లయింది.

అంతలోనే జిల్లా పరిషత్తు ఎలక్షన్లు వచ్చినాయి. రంగారెడ్డి తండ్రి వోడిపోయినాడు. ఆ వోటమికి ప్రత్యర్థి తరఫున విశ్వనాధం చాలా డబ్బు ఖర్చు పెట్టడం ప్రచారం చేయడం చాలా వరకు కారణాలని రంగారెడ్డి తండ్రి పక్షం వారి అనుమానం. అనుమానం, ఈర్ష్య ఉభయకుటుంబాల మధ్య అదివరకుండే సామరస్యాన్ని చాలా వరకు విషమం చేసినయ్. ఈర్ష్య పులిపి కార్పణ్యంగా రూపొందింది.

విశ్వనాధం పెద్ద కూతురు సరోజ బియ్యే పేసయింది. చిన్నప్పటి నుంచీ ఆ అమ్మాయిని శ్యామలరావుకిచ్చి చేయాలని విశ్వనాధం భార్యకీ మల్లిఖార్జున శర్మ కుటుంబానికీ మోజుగా వుండేది. మామగారి స్థితిగతుల్తో పోలిస్తే విశ్వనాధం చాలా మోతుబరి. గత పది సంవత్సరాలలో అతను పట్టింది బంగారమైంది. కాని మొదట్లో ఆయన కొన్న భూమి మల్లిఖార్జున శర్మ పలుకుబడి వల్లనే లభించింది. శ్యామలరావుకు మెడికల్ కాలేజీలో సీటు సంగతి తెలిసే దాకా విశ్వనాధం కూతురి విషయం ఔననేవాడు కాదనేవాడు కాదు. కొత్తగా కట్టబోతున్న ప్రాజెక్టులు వస్తే అతను దశ లక్షాధిపతి కాబోతున్నాడు. ఇది గాక పాలిటిక్సులో దిగాలనుకుంటున్నాడు. ఇప్పటికే అతను తలుచుకుంటే చేయలేని పనంటూ లేదు. ఏ మంత్రిగారితోనో వియ్యమందితే తనకీ తన కూతురికీ కూడా లాభం. ఈ మధ్య మామగారికీ తనకీ ఏ విషయంలోనూ పొత్తు కుదరడంలేదు: ఒకనాడు మామగారు పై విషయం ప్రస్తావిస్తే "నా కూతురేమిటి? మీ కొడుక్కివ్వడమేమిటి? బంధుత్వము ఉంది గదా అని అంతస్తులు మరచిపో గూడదు" అని కూడా అన్నాడు.

మల్లిఖార్జున శర్మ వళ్ళు మండిపోయింది. అంతస్తుల మధ్య భేదాల్ని అంతరింపజేసేది బాంధవ్యం. ఏక జాతీయత కలిగించేది భాష అని యింత కాలం విశ్వసించేవాడు. ఇప్పుడా విశ్వాసం విరిగిపోయింది. "నా కూతురికి నీ కొడుకు నచ్చలేదం"టే యెల్లా వుండేదో కాని విశ్వనాధం ఆ పాయింటు మీద కాదన లేదు. తను ప్రోత్సహించి యీ ప్రాంతానికి తీసుకు వచ్చి మా అల్లుడని చెప్పి చౌకగా పొలం కొని పెట్టబట్టేగా ఈ తిమురుడంతా? గుంటూరు జిల్లాలో తన కుగ్రామంలో పదెకరాల కొండరలో సతమతమౌతుండనిస్తే ఇంత మాటనేవాడా? అల్లుడైనా మేనల్లుడైనా సర్కారు జిల్లా వాడు సర్కారు జిల్లావాడే. తెలంగాణా వాళ్ళు తెలంగాణా వాళ్ళే. వాళ్ళకీ వీళ్ళకీ పొత్తు కుదరదు." అనే నిశ్చయానికి వచ్చాడు. ఆ సంగతి ప్రతివాడితోనూ చెప్పుకుని ప్రచారంలా మొదలెట్టాడు. తర తరాలుగా ఆ ప్రాంతంలోనే వుండే తన కొడుక్కి మెడికల్ కాలేజీలో సీటు రాలేదు. విశ్వనాధం తమ్ముడికి మాత్రం సీటు తెచ్చుకున్నాడు. ఆ పలుకుబడే బావమరిది కోసం ఉపయోగించలేకపోయినాడు. మల్లిఖార్జునశర్మ యీ ధోరణి విన్న తెలంగాణా ప్రాంతీయులకు నచ్చింది. వారందరూ ఆ నిర్ణయానికే వచ్చారు. ఇప్పటికైనా కళ్లు దెరచుకొని యీ సర్కారు వాళ్ళ విజృంభణ ఆరికట్టకపోతే తమ దేశంలోనే తమకు పుట్టగతులుండవనుకున్నారు వారందరూ

ఈ పరిణామాలన్నీ గమనిస్తున్న లాల్‌ఖానుకు యెంత మాత్రము నచ్చలేదు. తన పూర్వులు తెలంగాణా వాళ్ళు. తన తండ్రి తాత సర్కారు వాళ్ళు. మళ్ళీ లాభసాటిగా వుంటుందని తెలంగాణా వచ్చాడు. నైజాము ప్రభువు మచిలీపట్టణము, కర్నూలు, అనంతపురం, కడపజిల్లాలు బ్రిటీషువారికి దత్తం చేసి వుండకపోతే ఆ ప్రాంతాల వారిని యేమని వుండేవాళ్ళు? ఆ ప్రాంత వాసుల్ని యేమని వుండేవాళ్లు? రేపు నాగార్జున సాగర్ నీటిని ఆంధ్రుల దేశం నీరని వాడుకోడం మానర్రా యీ తెలంగాణా వాళ్ళు? ఎంత ఆలోచించినా అతని కిందులో సబబేమీ కనపడలేదు. అయినా విశ్వ నాధంతో చర్చించే ధైర్యం అతనికి లేదు. తన వియ్యంకుడు ఖాసింఖాన్‌తో చర్చించాడు.

ఖాసింఖాను పూర్వీకులు మల్లిఖార్జున శర్మ కుటుంబీకులవద్దనే నౌకరీ చేస్తూ బ్రతుకుతుండేవాళ్ళు. అయినా అతనికి సెంటు భూమి లేదు. లాల్ ఖాను ఆ ప్రాంతానికి వచ్చిన తరువాత వారిద్దరికి దోస్తీ కలిసింది. ఖాసింఖాన్ భార్య లేక లేక ఒక్క కూతుర్ని కని చచ్చి పోయింది. ఆ పిల్లను ఖాసింఖాను చెల్లెలు పెంచింది. పేరు కామె పెంచడమే గాని ఆ బిడ్డ మల్లిఖార్జున శర్మ భార్య శాంతమ్మ తొడల మీదే పెరిగింది. లాల్‌ఖాను కొడుకు ఖాదర్ ఖాన్ ఆపిల్లా ఒక్క యీడువాళ్ళు. అందరూ కలిసి వాళ్ళిద్దరికి పెళ్ళి చేశారు. అందుకు విశ్వనాధ శర్మ కూడా ప్రోత్సాహం యిచ్చాడు. ఖాసింఖాన్ బీద వాడు. లాల్‌ఖాన్ అతని కన్నా సంపన్నుడు. అంతస్తుల మధ్య భేదం వారి బాంధవ్యానికి అడ్డురాలేదు. అందుకు విశ్వనాధం అడ్డు చెప్పలేదు. ఇప్పుడేమి రగడ? ఖాసింఖాన్ జవాబు చెప్పలేకపోయినాడు. "అయ్య గారు నాకు యే లోపం రానియ్యలేదు. ధర్మారాజు! మంచి మహరాజ్. విశ్వనాధంగారి మాటా నాకూ నచ్చ లేదు" అని మాత్రం అన్నాడు. ఇద్దరూ కలిసి సీతారాం గాంధీ శలవులకు వస్తే అడుగుతా మనుకున్నారు.



దీర్ఘకాల అనావృష్టి

ఏ దేశంలోనయినా ఒకప్పుడు కాకపోతే మరొకప్పుడు వర్షాలు పడటం సహజం. కాని చిలీ దేశంలో 'డిసీర్టో-డి-అటకామా'లో సంవత్సరాల తరబడి వర్షాలు కురవలేదు. ఈ అనావృష్టి కాలం 400 సంవత్సరాలు.

శలవులకు వచ్చిన సీతారామగాంధీకి పరిణామాలు నచ్చలేదు. "ఇదంతా అన్నయ్యకు సంపదవల్ల కలిగిన అహంకారం. సరోజకు శ్యామల రావంటే యిష్టం లేదు. ఆ మాట చెబితే సరిపొయేది. కృష్ణా బ్రిడ్జి పడక మునుపు మమ్మల్ని కృష్ణా జిల్లా వాళ్ళు ఏటవతల వాళ్ళని పరిహసించి, మాతో ఎప్పుడోగాని సంబంధ బాంధవ్యాలు చేసేవాళ్లు కారు. మేమంతా వాళ్ళనీ పరిహసించే వాళ్ళం. వాళ్ళ తెలుగు మా తెలుగులాగా వుండదు. తూర్పుజిల్లాల వారి తెలుగు కృష్ణాజిల్లా తెలుగులాగా వుండదు. రజాకార్ గడబిడల్లో ఎంతోమంది షాహుకార్లు సర్కారు నగరాలకువచ్చి ఆస్తిపాస్తులు సంపాదించుకున్నారు. వార్నందర్నీ ద్వేషిస్తున్నామా? రాజధాని బెజవాడ గుంటూరుల మధ్య పెడితే తెలంగాణా షాహుకార్లు వచ్చి అక్కడ ఆస్తిపాస్తులు సంపాదించేవారుకారా? అయినా రంగారెడ్డి తండ్రి నారాయణ రెడ్డిని ఓడించిన వాడూ ఒక తెలంగాణా రెడ్డే. వ్యక్తిగతమయిన-పగ వ్యక్తిగతంగా తీరదు. అందుకు వొక ఉద్యమం లేవదియ్యాలి. తెలుగు వారిని తెలంగాణా వారనీ సర్కారు వారనీ ఆంధ్రులనీ వేరుగా భావించడంలో అర్థం లేదు. ఒక జిల్లా నాయకుడికి జిల్లాపరిషత్తు ప్రెసిడెంటయే అవకాశం లేకపోతే ఎ విధంగా జిల్లాను విభజిస్తే తాను పరిషత్తు ప్రెసిడెంటయ్యే అవకాశం వుంటుందో ఆ విధంగా విభజించాలని ఆందోళన చేస్తాడు. అధికారంలో వున్న వారికది నచ్చితే అందుకు మద్దతు యిస్తారు కూడా. విభేదాలు కల్పిస్తేగాని స్వార్థపరులు బాగుపడరు. అయినా తెలంగాణాలో రైతులు తమ భూముల్ని సాగుచేయడం చేతగాకపోతే చేతనైన వారిని తీసుకొచ్చి నేర్చుకోవాలి. మిగిలిన వారికి ప్రభుత్వం కోపరేటివ్ బ్యాంకుల ద్వారా ఋణాలిచ్చి భూముల్ని బాగు చేసుకునేటట్లు చేయాలి. తెలంగాణా మంత్రులందుకు ప్రయత్నించాలి. ఎవరో వచ్చి బాగుపడ్డారంటే అర్థంలేదు. ఏ ప్రాంతం వారైనా ఇతర ప్రాంతాల వారిని రానీయకపోతే ఇక దేశమేమిటి? సత్యదృష్టి, న్యాయదృష్టి లేకుండా ప్రవర్తిస్తే యిల్లాగే అవుతుంది. కోయంబత్తూరు జిల్లాలో ఎక్కడ జూసినా తెలుగు కమ్మవారే. ఇక్కడ వారిని చౌదర్లంటాం. అక్కడ నాయుడులంటారు. ఈ భేదాలన్నీ అజ్ఞానం వల్ల కలిగే అవేశఫలితాలు; స్వార్థసాధనకు సాగించే దుష్ప్రచారాలు" అన్నాడు సీతారాంగాంధీ.

సాయిబులిద్దరికీ ఆ మాటలు నచ్చినాయి. "సరైన మాట!" అన్నారు. సమాధానపడ్డారు.

కాని మల్లిఖార్జునశర్మ కుటుంబంవారు అల్లా సమాధానపడలేదు. సర్కారువాళ్ళతో సంబంధం చెయ్యటమే తప్పు. వాళ్ళ మాటలు నమ్మి విశాలాంధ్ర నిర్మాణానికి వొప్పుకోవడం పెద్ద తప్పు. మర్రి చెట్టు పెరిగిన కొద్దీ ఊడలుదించుకుంటూ శాఖోపశాఖలుగా పెరిగిపోతూ పరిసర ప్రదేశంలోయే చెట్టునీ బ్రతకనీయనట్లు ఇప్పుడు చెల్లాచెదురుగా అక్కడక్కడ ప్రవేశించి ఆస్తిపాస్తులు సంపాదించి ఆనాటికానాడు పెరిగిపోతున్న సర్కారు జిల్లావాళ్లు ఇంకో వంద సంవత్సరాలు పోతే వామన మూర్తి ముల్లోకాలు అక్రమించుకున్నట్లు అక్రమించుకుంటారు. ఇప్పుడే వారి ఉధృతమును అరి కట్టాలి. ఏమిటి సాధనం?

నారాయణరెడ్డి, మల్లిఖార్జున శర్మా ఆలోచించారు. "ఇప్పుడు చూస్తూ వూరుకుంటే తరతరాల బట్టి మనం నివసిస్తున్న వూళ్ళలో మన హక్కు భుక్తములలో వున్న మన పొలాలన్నీ వాళ్ళు ఆక్రమించుకొని మన ప్రాంతంలోనే మనల్ని బానిసల్ని చేస్తారు. గులాముల్ని చేస్తారు ఒకనాటికి మన పొలాలలోనే మనం కూలీలుగా పని చెయ్యాలి వారికి డబ్బు వుంది వ్యవసాయం చెయ్యడంలోనూ వ్యాపారం చెయ్యడంలోనూ నేర్పు


వుంది. మనకిలేదు. మనం మూడువందల యేళ్ళబట్టీ ఉర్దూకు అలవాటుపడి స్వచ్ఛమైన తెలుగు మాట్లాట్టం మరచిపోయినాం. ఈ విషయాల్లో మనం మూడు శతాబ్దాలు వెనకబడి వున్నాం. నవాబు దర్జాలు మరిగి సోమరిపోతులమైనాం. ఏ విధంగానూ సర్కారువారితో పోటీ చెయ్యలేం. వాళ్ళు డబ్బుతో మనల్ని కొంటారు. మనవాళ్లని మనమీదే ఉసిగొల్పుతారు. మన ఐకమత్యం చెడగొడతారు. మనం రాజకీయంగా ఎప్పుడూ మైనారిటీ లోనే వుంటాం. డూడూ బసవన్నలుగా ఉండేవారినే శాసన సభ్యులుగా నిలబెడతారు. ఎదురు తిరిగిన వాణ్ణల్లా అధికారంతో అర్థబలంతో అణచివేస్తారు. మదరాసు రాష్ట్రంలో అరవవారు చేసిన పనే ఆంధ్రులూ మనకు చేస్తారు. తెలుగువారు ఐదుకోట్లమంది ఐనా సంఘ బలంతో హిందీ వాళ్ళేం చేస్తున్నారు? అధికారాలూ అవకాశాలూ యెరపెట్టి మనవారిచేతనే హిందీ కావా లనిపించడంలేదా? రేపు తెలుగుభాష ఆంధ్రప్రదేశ్ అధికార భాష అయితే మనం సర్కారు వారితో పోటీ చెయ్యలేం. ఒకప్పుడు ప్రతాపరుద్రుడు మనవాడే కావచ్చు. పోతన్న మన దేశంలోనే పుట్టవచ్చు. ఆ కాలం వేరు, ఆ పరిస్థితులు వేరు. ఇప్పుడు చారిత్రిక కారణాలచేత వెనకబడివున్నాం. తెలంగాణా వారు ఎప్పుడూ వెనకబడి వుండాలనే, ఉర్దూను ద్వితీయ ప్రభుత్వ భాషచేశారు." ఎలక్షన్‌లో ఓడిపోయిన నారా యణ రెడ్డి మెదడు పాదరసంలాగా పని చేస్తోంది. ఆర్థిక వ్యత్యాసాలతో అల్లుడిచేత అవమానింపబడ్డ మల్లి ఖార్జునశర్మ మనస్సనే పెట్రోలు టేంకుకు ఈవాదన నిప్పులాగా ముట్టుకుని భగ్గుమంది.

"అవును. ఒకభాష మాట్లాడినంత మాత్రం చేత అందరూ ఏకటవుతారా? అప్పుడు హిందీభాషమాట్లాడే వాళ్ళందరూ ఒక రాష్ట్రంలో ఎందుకుండరు? ఆర్థిక లాభాల ముందు బంధుత్వం, భాషా గుడ్డి గవ్వకైనా చెల్లవు. భాషే ముఖ్యమైతే పల్నాటి యుద్ధమెందుకు జరుగుతుంది? భాష యేకత్వం కలిగించదు. మతము ఏకత్వం కలిగించదు. ఏకీభావం కలిగించేది,ఆర్థికలాభం, ఆర్థికంగా ఏ పద్ధతి ముందుకు తీసికెళ్తే అదే మన ఆదర్శం. ఆర్థిక పురోభివృద్ధితోపాటు సాంస్కృతిక పురోభివృద్ధిదానంతట అదే కలుగుతుంది. ఇల్లా మనం మనలోనే గొణుక్కుంటూ కూర్చుంటే లాభంలేదు. మన ప్రాంతంలో పెద్దల్ని సంప్రదించాలి. తెలంగాణాలో అన్ని పక్షాలవార్నీ కూడ దీసుకోవాలి." అన్నాడు మల్లిఖార్జున శర్మ.

* * *

వ్యక్తిగతములైన అవమానాలూ కార్పణ్యాలు ప్రాం తీయావేశాలకు వైషమ్యాలకు దారితీసినాయి. తమరు ప్రారంభించే ఆందోళనల అంతిమ పరిణామాలు ఎల్లా ఉంటాయో, తమర్ని నమ్మి అనుసరించే అమాయకుల జీవితాలు ఏమౌతాయో అని ఆలోచించకుండా అవకా శం దొరికినప్పుడల్లా ప్రజలను రెచ్చగొట్టే కొన్ని పార్టీ లకు మంచి అవకాశం దొరికింది. అధికారంలో ఉన్న పక్షం మీద తారు చల్లడానికి మంచి అవకాశం అనుకుని రగుల్తూ, కుముల్తూ ఉన్న క్రోధ ద్వేషాగ్నిని కార్చిచ్చుగా మార్చేశారు వారు. ఇదే అదనని గుండాలు దోపిడీదారులు కొల్లగొట్టడం సాగించారు, శ్రమపడి, వ్యయపడి, బంజరు భూముల్ని సస్యశ్యామలంగాను, కొండ ప్రదేశాలను కర్మాగారాలుగాను మార్చివేసిన సర్కారు జిల్లావారిని తరిమి వేయడానికి ఇదే అవకాశమని వారి ఆస్థులు స్వాధీనం చేసుకుంటానికి ఇదే అదనని దురాశతో దూరాలచనను, వివేకాన్నికోల్పోయిన ఛోటా నాయ కులు భావించారు.

కడుపులో నీళ్లు కదలకుండా ద్రాక్షపళ్ళతోటలలో శాంతిమయ జీవితాన్ని సాగించే కృషీవలులు ఇళ్లూ వాకిళ్లూ కోల్పోయినారు. నిమ్మకునీరెత్తినట్లుగా వ్యాపా రం సాగించుకుంటున్న వర్తకులు వ్యాపారం కోల్పోయి నారు. పాఠశాలల్లో తమకు లభించే కొద్ది జీతాలతోనే తృప్తిపడి, తమ దగ్గర చదువుకునే బాల బాలకులను ప్రేమించే ఉపాధ్యాయుల్ని "మా దేశం విడిచి వెళ్ళండి. లేకపోతే మీ ప్రాణాలు దక్కవ"ని బెదిరిస్తే, "ఇంకొక్క మాసం రోజులు గడువు ఇవ్వండి. పిల్లలకు పరీక్షలు దగ్గరకు వచ్చినాయి. పాఠాలు ముగించి వెళ్ళిపోతాం. లేకపోతే ఏ పాపం ఎరుగని అర్భకులు. మీ పిల్లలే పాడై పోతారు" అని బతిమాలే ఉపాధ్యాయుల్ని కూడా ప్రాణభీతితో తల్లడిల్ల చేస్తే తమ గురుపుంగవుల దీనా వస్థ చూసి, ఏం చేయాలో తెలియని వయస్సురాని బడిపిల్లల లేత చెక్కిళ్ళు బాష్పవారితో పంకిలము లయినవి. "మాష్టారు! వెళ్ళద్దు!" అని ఏడ్చే పిల్లల్ని



**పొడుగు మనిషి**

ప్రపంచంలోకెల్లా పొడుగుమనిషి ఎవరను కుంటు న్నారు? అమెరికాలోని ఆర్.పి.వాడ్లో. ఇతని ఎత్తు 272 సెంటీమీటర్లు. అంటే 8 అడుగుల 11 1/2 అంగుళాలు. ఇప్పటికీ ఈ విషయంలో ఇతనిదే రికార్డు!

వదలలేక "అలజడులు తగ్గిన తర్వాత మళ్ళీ వస్తాము. అందాకా చక్కగా చదువుకోండి! ఏడవకండి" అని బుజ్జగిస్తూ బస్సులు దొరికితే బస్సుల మీద, బళ్లు దొరి కితే బళ్ళ మీద, ఏమీ లేకపోతే పాదచారులై, మొగవాళ్లూ బిడ్డా పాపలను ఎత్తుకుని ఆడవాళ్ళూ ఏడుస్తూ తమరంత వరకూ సుఖ జీవనం చేస్తున్న ఇళు వాకిళ్ళని వదిలిపెట్టి వెళ్ళిపోయినారు. చిన్న చిన్న పట్నాలలోను, మారు మూలల ఉన్న పల్లెటూళ్ళలోను వైద్యం చేసుకుంటూ, అంతవరకూ తమను ప్రేమించిన పేషంట్లే కార్పణ్యంతో కన్నెర్ర చెయ్యగా ప్రాణభీతితో ఎక్కడి డాక్టర్లక్కడే సరుకు సరంజామా వదిలిపెట్టి పోయినారు. మేడలు కూలిపోయినాయి. ఇళ్లు తగలడిపోయినాయి. పంట చేలు పాడై పోయినాయి. మనుష్యులలో, మర్త్యులలోను నిగుంభితమైన మానవత్వం అంతరించి రాక్షసత్వము, ప్రాంతీయ విద్వేషము విలయ తాండవం చేసినాయి. ఐదు గంటల దాకా ఆఫీసులో పనిచేసి ఆంజనేయ దేవాలయంలో ధ్యాన సమాధిలో మునిగి ఉన్న సర్కారు భక్తుడి తలకాయ, దండాఘాతంతో దిమ్మ దిరిగి, అతను ప్రమాదావస్థలో నేలకొరిగాడు. ఆ పుణ్యం కట్టుకున్న వాడు నారాయణరెడ్డి కొడుకు రంగారెడ్డి. పక్కనే ఉండి, దండనాయకత్వం వహిస్తున్న శ్యామలరావుకు కూడా ఆ దృశ్యం హృదయ విదారకంగా కనుపించింది. మరో దెబ్బతో కొన ఊపిరితో ఉన్న ఆ సాధుశీలుణ్ణి పూర్ణ నిహతుణ్ణి చెయ్యబోయే రంగారెడ్డిని ఆపి, "ఆయన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. మరీ తొందర పడ డం మంచిది కాదు. ఈ సంఘటన దుష్ఫలితాలు ప్రమాదకంగా పరిగణింపవచ్చు" అని ఒక తెలంగాణావాడి బండిలో వేసి ఆ ఉద్యోగిని ఆసుపత్రికి పంపాడు ఆసు పత్రిదాకా ఆయన బ్రతికి ఉండడం దుర్లభమని తెలిసి కూడా! రంగారెడ్డి, శ్రీనివాసరావు బిక్కు బిక్కుమంటూ నారాయణరెడ్డి ఇంటికి వెళ్ళి జరిగింది నివేదించారు. అక్కడే కూర్చుని స్ట్రేటజీ రూపొందిస్తున్న మల్లిఖార్జున శర్మ ప్రాణం చివుక్కుమంది. "పని బుద్ధిచుకుని ఆ సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగిని ఎందుకు కొట్టావు రంగారెడ్డీ! వాడు బ్రాహ్మడు కనక సరిపోయింది. ఏ హరిజనన్నా అయితే పార్లమెంటంతా పరవళ్ళు తొక్కేది. కేంద్రప్రభుత్వమే కదిలి వచ్చేది. ఆ పరాత్పరుడు మనయందుండి ఆ దౌర్భాగ్యుడు బతికి బయటపడితే ఆంజనేయస్వామికి పది కొబ్బరి కాయలు కొట్టి చక్రపొంగలి పంచి పెడతా"నని భక్తి పారవశ్యంతో కళ్లు మూసుకుని తల ఒగ్గి నమస్కారం చేశాడు. నారాయణ రెడ్డి మనోధైర్యం కూడా కుంగిపోయింది.

* * *

అన్నహారాలు లేకుండా అర్ధభాగములు ముండితములైన శిరస్సులతోను పాలులేక ఏడుస్తున్న పసిపాలతోను, కలలోనైనా తలచి ఎరుగని అవాంతర పరిస్థితిలో అల మటిస్తున్న సతీమతులతోను రైళ్ళన్నీ నిండిపోయి నాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరు. హాస్పట ళ్ళలో నర్సులు, డాక్టర్లు లేరు. ఫ్యాక్టరీలలో అనుభవజ్ఞు లైన పనివాళ్ళు, ఉద్యోగులు లేరు. ధాన్యరాసులు తగ లడిపోయినందువల్ల తినడానికి తిండిలేదు. సరుకులు సరఫరా చేసే కిరాణా కొట్లన్నీ మూతబడిపోయినాయి. ఎక్కడ చూసినా దోపిడీలు. ఘోరదురంతాలు చూసి సర్కారు జిల్లావారు ఎన్నో సంవత్సరాలుగా ఇల్లువాకిళ్ళు ఏర్పరుచుకుని,సుఖ జీవనం చేస్తున్న తెలంగాణా వ్యాపా రస్థుల మీద, ఉద్యోగుల మీద దాడి చేసి, మర్యాదగా వెళ్ళిపొండని చెప్పారు.

అంతవరకూ ఉద్యమం వెనక ఉన్న తెలంగాణా నాయకుల కుటుంబాలకు అట్టే ప్రమాదం రాలేదు. విశ్వనాథం పెళ్ళాన్ని పుట్టింట్లో వదలిపెట్టి హైదరా బాద్‌లో పెద్ద హోటలులో పోలీసు రక్షణ క్రింద క్షేమంగా కూర్చుని బ్రాందీ బుడ్లు ఖాళీ చేస్తున్నాడు. ఆవేశాలు హెచ్చుమీరిపోయిన తెలంగాణా యువకులు "ప్రబుద్ధుడు భార్యని ఇక్కడ కాపలా ఉంచిపోయినాడా! ఈవిడ కూడా వెళ్లాల్సిందే. లేకపోతే మర్యాద దక్కదు." అని మల్లిఖార్జున శర్మ ఇంటికి ఒచ్చిపడ్డారు. మల్లిఖార్జున శర్మ "ఆడకూతురు ఎక్కడికి వెళుతుందిరా?" అన్నాడు. వాళ్ళు "వెళ్ళిన ఆడకూతుర్లు అందరిలాగే ఈవిడా వెళుతుంది." అన్నారు. ఆ అమ్మాయిని చిన్నప్పట్నించీ ఖాసింఖాను ఎత్తుకు మోశాడు. దౌర్జన్యకాండ తన బిడ్డ దాకా రావడం చూసి శాంతమ్మ "మీరూ మీ ఉద్యమాలూ మండినట్లుంది. నా బిడ్డ కాపరం నిలువునా తీశారు." అని గొల్లుమంది. ఒచ్చిన జనం "అదంతా కుదరదు. నలుగురితోపాటు నారాయణా! మళ్ళీ మొగుడితో సంబంధం పెట్టుకోకుండా ఉంటే ఉండమనండి. లేక

పోతే దయ చెయ్యమనండి" అన్నారు. ఖాసింఖానుకి కళ్ళ నీళ్లు తిరిగినాయి. మహా దుఃఖంతో ముందుకు ఒచ్చి "బాబూ! ఈ బిడ్డను సాయంకాలం ఇక్కడ ఉండనివ్వను. నేను చిన్నప్పటిన్నుంచీ ఎత్తుకుని పెంచిన బిడ్డ. రెండు గంటల టైమిస్తే వాళ్ళ ఆయన దగ్గరకు పంపిస్తాను" అన్నాడు. ఒచ్చినవాళ్ళు "వాళ్ళాయన హైద్రాబాద్‌లో కులుకుతున్నాడు. హైదరాబాద్ కూడా తెలంగాణాలోదే. దేశం వదలిపోవాలి. తెలంగాణాలో ఎక్కడా ఉండకూడదు. వాళ్ళ ఆంధ్ర దేశం పొమ్మను. మళ్ళీ సాయంత్రం నాలుగు గంటలకు వస్తాం. ఖాసింఖాన్ సాయంత్రం ఈ అమ్మాయి ఇక్కడ ఉండకూడదు జాగ్రత్త!" అని వెళ్ళి పోయారు. ఖాసింఖాన్ చేతులు నలుపుకుంటూ "అరే! అల్లా! ఏమి దుష్కాలం వచ్చింది! ఈ బిడ్డ మొగుడు సర్కారువాడు అయితే నా బిడ్డ మొగుడూ సర్కారువాడే. ఈ అమ్మకి తల్లేనా ఉంది. నా బిడ్డకు తల్లీ కూడా లేదు. ఏమ్ చెయ్యాలా. ఏమ్ చెయ్యాలా?" అనుకుని ఆందోళనలో పచార్లు చెయ్యడం మొదలు పెట్టాడు. ఛట్టుకున అతనికి ఒక ఆలోచన తట్టింది. "అచ్చా! యజమాన్! ఇప్పుడు ఆలోచించడాన్కి టైంలేద్, ఎట్టాగో ఈ ఆపద గట్టెక్కాలి. హదృష్టంకొద్దీ మా ఇళ్ళల్లో ఇంకా బుర్ఖాలేసుకుంటూనే హున్నారు. ఈ బిడ్డను మా ఇంట్కే బుర్ఖా ఏసి గదిలో ఉంచేస్తాను. హిందోళన చేసేవాళ్ళెవరు మా జనానా జోలికి రారు. నా బిడ్డ మాదిరి చూస్కుంటాన్. నేనే అన్నం ఇక్కట్నుంచి తీస్కునిపోయ్ పెడ్తాన్." అన్నాడు.

ఈ సంఘటనలన్నీ గమనిస్తున్న సీతారాంగాంధి ఎన్నో ఆలోచనలతో ఉడికిపోయినాడు. అతనికి ఉర్దూ బాగావచ్చు. ప్రాణభీతితో గుంటూరు పారిపోకుండా ముస్లిం యువకుడి వేషంతో తెలంగాణాలో, వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ విషయాలు తెలుసుకుంటూ ఉన్నాడు. మల్లిఖార్జున శర్మ రెండవ కూతురు మాలతి అంటే అతనికి చాలా ఇష్టం. మాలతి తన అన్నగారి కూతురు సరోజనీలాగా చొరవైందికాదు. ముగ్ధ. ఆ అమ్మాయి ఎప్పుడూ ప్రేమ విషయం మాట్లాడక పోయినా ఆమె వాలకం వల్ల తన మీద అనురాగం ఉన్నట్టే గ్రహించాడు. ఈ ప్రాంతీయ వైషమ్యాలతో తన కుటుంబం వారు మల్లిఖార్జున శర్మ కుటుంబం వారు బద్ధ విరోధులు అయినారు. అహింసా తత్పరుడైన గాంధీజీ పుట్టిన దేశంలో, గాంధీ శతజయంత్యుత్సవ కాలంలో ఒకే భాషమాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా సంబంధ బాంధవ్యాలేర్పరచుకుని, అన్యోన్యంగా, ఆపేక్ష అంతఃకరణలతో మెలుగుతున్న తెలుగు వారి మధ్య ఆంధ్ర తెలంగాణా భేదా లేర్పడడం అతనికి అపార దుఃఖం కలిగించింది. ఈ సంఘటనలు తనకు, మాలతికి మధ్య పెద్ద అగాధాన్ని ఏర్పరచినాయ్. మల్లిఖార్జున శర్మగారు సరోజను కోడలుగా చేసుకోవాలనుకున్నారు. అన్నయ్య అంగీకరించక కార్పణ్యాన్ని కలిగించాడు. తను వాళ్ళ అమ్మాయిని చేసుకుందామనుకుంటున్నాడు. ఆ మాట ప్రస్తావించ డానికి కూడా అవకాశం లేకుండాపోతోంది. తను, గాంధీజీ అనుచరుడై, కారాగృహవాసం చేసి, దేశసేవ సలిపిన గాంధీయుడికి కొడుకు, గాంధీనామం తన పేరులోనే ఉంది. గాంధీజీ ఏ వేషమూ లేకుండానే నౌఖాలీ హంతకుల మధ్యకు పోయినాడు. తను మారువేషంతో ఎంతో విరోధం ఏర్పడినా, సన్నిహిత బంధువుల ఇంటికి పోలేడా? తన హృదయాన్ని వెల్లడించుకోలేడా? తన మాలతిని దక్కించుకోలేడా? ఈ ఉద్దేశ్యంతో అతను మల్లిఖార్జునశర్మ ఊరికి వెళ్ళాడు. సరిగ్గా ఖాసింఖాను మల్లిఖార్జునశర్మతో అంటున్న మాటలు విన్నాడు. తన ఒదినగారి దురవస్థ కళ్ళారా చూశాడు.

రజాకార్ ఉద్యమంలో శముస్లింలే హిందువులను చిత్రవధ చేశారు. ఆ సమయంలో ఈ తెలంగాణా వాళ్లనే తన కుటుంబంలాంటి కుటుంబాల వాళ్లెందరో ఆదరించి కడుపులో పెట్టుకుని కాపాడారు. ఇప్పుడొక ముస్లిం తన ఒదిన గారిని తెలంగాణా వారికి వ్యతిరిక్తంగా తన యింట్లో దాచి కాపాడడానికి ఉద్యుక్తుడౌతున్నాడు. ఇది ఏం విచిత్రం? మానవుల్ని సన్నిహితుల్ని చేసేదీ వారి మధ్య అన్యోన్యతనీ, అనురాగాన్నీ పెంపొందించేదీ ప్రేమ. దేశాన్ని రక్షించేవి, భాషోన్మాదము, భావావేశము కాదు. న్యాయధర్మములతో కూడుకున్న ప్రేమ. ఖాసింఖాను బయల్దేరి ఇంటికి పోతుండగా. తురక వేషంతో సీతారామ్ గాంధీ, మల్లిఖార్జున శర్మ ఎదటబడి "ఆగండి!" అన్నాడు శర్మ దిగ్భ్రాంతుడై ఎవడా? అని అతనివంక చూస్తున్నాడు. అంతవరకు ఆశ్చర్యంతో అక్కడే ఉన్న శాంతమ్మ, మాలతి అతని వంక చూశారు. సీతారామ్ గాంధీ, మాలతి ఒకళ్ళనొకళ్లు చూసుకున్నారు.

అవ్యాజము, అవ్యక్తము, దివ్యము, అనాది అయిన సంబంధమేదో వారి అన్యోన్య వీక్షణాల ద్వారా ప్రజ్వరిల్లింది. వారి ప్రేమావేశం ఒకరి హృదయంలో నుంచీ ఇంకొకరి హృదయంలోకి దూకి పరిభ్రమణం చేసింది. సీతారామ్ గాంధీ టోపీ తీశాడు. గడ్డం లాగి పారేశాడు. మల్లిఖార్జున శర్మ గుర్తుపట్టి "ఏం నాయనా? మామీద ఇంత అనుగ్రహం? ప్రాణాలకు తెగించి వచ్చావు?" అన్నాడు. కలవరపడకుండా, ప్రస్ఫుటంగా, స్పష్టంగా సీతారామ్‌గాంధీ "మాలతిని నాదాన్ని చేసుకోవాలని వచ్చాను. సరోజ విషయంలో మా అన్నయ్య తిరస్కారం, అధిక ప్రసంగం, మన కుటుంబాల మధ్య, ప్రాంతాల మధ్య కార్చిచ్చు రేపింది. మాలతిని నేను ప్రేమించాను; ఆ ప్రేమభావం మన అందరి హృదయాల్లోనూ ప్రేమానురాగాలు సృష్టించి హృదయ వైశాల్యతను ఏర్పరచి విశాలాంధ్రను కాపాడుతుందని ఆసిస్తున్నాను" అన్నాడు.

ఆనందంతో ఖాసింఖాను కంఠం రుద్ధమైంది. మాట్లాడలేక రెండు చేతులూ సీతారాంగాంధీ భుజాల మీద ఉంచి-

"సిన్న మహరాజ్! సిన్నవాడివి అయినా మంచి మాట చెప్పావ్! మంచి మాట చెప్పావ్!" అని ఆనందంతో ఊగిపోయినాడు.

శాంతమ్మ. కళ్ళు పెద్దవి చేసుకుని అలాగే చూస్తూ ఉండిపోయింది. మల్లిఖార్జునశర్మ మనస్సులో సుడిగుండాలు తిరుగుతున్నాయి. మాలతి కళ్ళలో ఆనంద మేఘాలు అవిరళంగా భాష్పాశ్రువులు వర్షించినాయి ఏమనుకున్నాడో ఏమో, మల్లిఖార్జున శర్మ మెల్లిగా లేచి "నీపాటి వివేకం మాకందరికీ ఉంటే ఈ ఘోరకలి ఏర్పడకుండా ఉండేదేమో! నువ్వు కూడా ఖాసింఖాన్ ఇంటికేవెళ్ళి తలదాచుకో. ప్రశాంత పరిస్థితులు ఏర్పడిన తర్వాత ఆలోచిద్దాం." అన్నాడు.

హర్షాతిరేకంతో సీతారాంగాంధీ మాలతివంక చూశాడు. సిగ్గుతో ఆమె పాలబుగ్గలలో సిందూర రేఖలు తాండవించినాయి.

ఆమె గిరుక్కున లోపలికి పారిపోయింది.

ఖాసింఖాన్ ఇంట్లో లాల్‌ఖాన్, అతని కొడుకు, ఖాసింఖాన్‌కూతురు, విశ్వనాధశర్మ భార్య. సీతారాంగాంధీ రహస్య జీవనం చేస్తున్నా ఆనందంతోనే రోజులు గడిపారు.

* * *

ఎన్నోవేల కుటుంబాలలో ఇల్లాంటి మనఃపరిపక్వమే కలిగింది. ప్రకోపించిన ద్వేషోన్మాదం ప్రాంతీయ వైష్యమ్యం క్రమంగా ఉపశమించినాయ్. క్రమంగా సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయి. ముసలంలోనే ముక్తి కలిగింది.

ఆంధ్రమాత ఆనందంతో హర్షాశ్రువులు రాల్చింది.



## పోస్ట్ కార్డుపై రికార్డు సృష్టించిన

## టి. సుజాత

విశాఖపట్నం, డాక్టరు వి.ఎస్. కృష్ణ కళాశాలలో బి.ఏ. తృతీయ సంవత్సరం చదువుతున్న కుమారి తొగురు సుజాత, పోస్టుకార్డు మీద న్యూటెస్ట్‌మెంటు బైబిల్ గ్రంధంలోని ఇరవై మూడు అధ్యాయాల సామెతలను, ఇంగ్లీషులో లక్షాపదమూడువేల మూడు వందల ఏభై అయిదు అక్షరాలు రాసి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులోకి ఎక్కాలని ప్రయత్నిస్తున్నది.

ఆంధ్ర విశ్వవిద్యాలయం వున్నత పాఠశాలలో పదవతరగతి చదువుతున్న కుమారి గాదె ఉమాపరమేశ్వరి, 81,544 అక్షరాలు పోస్టుకార్డుపై రాసి, రికార్డు సృష్టించిన విషయం 'వనిత' పాఠకులకు విదితమే! అలాగే విశాఖపట్నం బి.వి.కె. కాలేజీలో బి.ఎస్సీ చదివిన మోడేకుర్తి ఇందిర పోస్టు కార్డుపై 5,486 షార్ట్‌హాండ్ స్ట్రోక్స్ రాసింది.

కుమారి సుజాత, రోజుకు నాలుగు గంటలు చొప్పున అయిదు రోజుల కాలంలో, అంటే ఏకధాటిగా కాకుండా, 20 గంటల కాలంలో, పోస్టుకార్డు మీద, పెన్సిల్‌తో, లక్షా పదమూడువేల, మూడువందల ఏభై అయిదు ఇంగ్లీషు అక్షరాలు రాసింది.

టి.వీలో "సాక్షి" కార్యక్రమంలో సికింద్రాబాదుకు చెందిన ఒక అమ్మాయి పోస్టు కార్డుమీద 26వేలు అక్షరాలు రాసిన సంఘటన తనకు ప్రేరణ యివ్వగా, స్థానిక ఉమాపరమేశ్వరి సాధించిన రికార్డు స్ఫూర్తితో తాను రికార్డు స్థాయిలో 1,35,355 అక్షరాలు రాయగలిగాను అంది కుమారి సుజాత.

\- ఎమ్.ఎస్.ఆర్.